# అనుబంధం

"మీరు అటు ఆఫీసుకు వెళ్ళగానే గుంటూరునుంచి ఫోను వచ్చింది!" అన్నది రాజ్యలక్ష్మి భర్త సాయింత్రం ఆరు గంటలప్పుడు ఇంటికి వచ్చి బూట్లు విప్పుకుంటున్నప్పుడు.

"ఏమిటిట... అంతా కులాసానా?"

"అందరూ కులాసాగా వుంటే మనకు ఫోన్లు ఎందుకు వస్తయి అక్కడనుంచి... మీ అన్నయ్యకు బాగాలేదుట... ఆసుపత్రిలో జేర్చారుట... మిమ్మల్ని వెంటనే రమ్మనమన్నారు!" అంటూ వంటింట్లోకి వెళ్ళింది భర్తకు మంచినీళ్ళు తెచ్చేటందుకు గాను.

"అయ్యో! అలాగా!" అన్నాడు ఆదుర్దాగా సచ్చిదానందమూర్తి.

రాజ్యలక్ష్మి మూతిని వంకర్లు తిప్పింది. "ఆ కారణంతో మిమ్మల్ని వాళ్ళు ఇప్పటికి ఎన్నిసార్లు పిలిపించారో గుర్తున్నదా?... నాలుగు సార్లా, అయిదు సార్లా!"

సచ్చిదానందమూర్తి మాట్లాడలేకపోయాడు. చాలాసార్లు వెళ్ళిన మాట నిజమే-కానీ వాళ్ళ ఆదుర్దా వాళ్ళది. పెద్దాయన. ఒక్కతే కూతురు. వదిన ధైర్యస్థురాలు కాబట్టి నావ అటూయిటూ తరచూ ఊగుతున్నా రోజులు నెట్టుకు వస్తున్నది. కూతురు టీచరుగా పనిచేస్తున్నా ... ప్రైవేటు స్కూలు. అంతంత మాత్రపు జీతాలు. ఇక ఆయనకు వచ్చే పెన్షన్‌గూడా రెండు వేలకు మించి వుండదు... ఎలా తిప్పలు పడుతున్నారో ఏమిటో వాళ్ళకే తెలియాలి!

ఓ నిట్టూర్పు విడిచి, విప్పిన బూట్లు స్టాండులో పడేసి, వాష్ బేసిన్ దగ్గర చేతులు కడుక్కు వచ్చి, టీపాయ్ మీద పెట్టిన మంచినీళ్ళ గ్లాసును అందుకున్నాడు.

"మీరు ఇప్పుడేం హడావుడి పడుతూ వెళ్ళనఖ్ఖర్లేదులేండి... నేను చెప్పేశాను... మీరు ఊళ్ళో లేరని... ఆఫీసు పని మీద నిన్ననే బొంబాయి వెళ్ళారని... నాలుగు రోజుల తరువాత వస్తారని!"

కనురెప్పలార్పటం గూడా మరిచిపోయి భార్య వంకే చూస్తున్నాడు సచ్చిదానందమూర్తి.

"ఆయనకేం ఆయన బాగానే వుంటాడు... మీరు వెళ్ళటం, రావటం, అక్కడ మందులకు, హాస్పిటళ్ళకు ఖర్చుపెట్టటం... ఆపైన శెలవలు వృథా చేసుకోవటం- ఎన్నడైనా పిల్లలను రెండు రోజులు సరదాగా ఎక్కడికైనా తీసుకు వెళ్దామండీ అంటే శెలవు లేదంటూ నసగటమూ!" విసురుగా అనేసి బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది- ఉతికిన గుడ్డల అలమరలోనుంచి ఆయనకు లుంగీ తెచ్చి ఇచ్చేటందుకు.

సచ్చిదానందమూర్తికి నోరు పెగల్లేదు.

"ఇప్పుడంటే సరే... రేపు మన అమ్మాయి పెళ్ళీడుకొచ్చేటప్పటికి ఎంత కట్నం పోయాలో, పిల్లవాడి పైచదువులకి ఎన్ని డొనేషన్లు కట్టాలో మనస్సులో వుంచుకుంటే ఖర్చులు సగం తగ్గుతయి... దాని పేరున ఒక పాలసీ తీసుకోండి, వాడిపేరున ఓ ఆర్డీ వేయండి, కాస్త దేనికైనా పనికివస్తుంది ఓ చీటీ కట్టండి అని వాళ్ళు పుట్టినప్పటినుండీ మొత్తుకుంటున్నా... ఎప్పుడు ఆమాట ఎత్తినా 'చూద్దాం... చూద్దాం' అనటమే తప్ప ఏమైనా చేశారా!... ఇదుగో ఇలాంటి వెధవ ఖర్చులు పెట్టటానికి మాత్రం నేనున్నానంటూ ముందు తయారవుతారు!"

భార్య మాటలకు చికాకు వేసింది సచ్చిదానందమూర్తికి. "సరేలేవే... వెళ్ళను... వాళ్ళ చావేదో వాళ్ళు చస్తారు... ముందే నువ్వు ఏడ్వబోకు!" అన్నాడు.

"అవును... మంచి మాటలు మాట్లాడినా నేను ఏడ్చినట్లే వుంటుంది... అనండి అనండి... కట్టుకున్న పెళ్ళాన్ని అనకపోతే ఊళ్ళోవాళ్ళను అంటారా... అంటే మాత్రం వాళ్ళు ఊరుకుంటారా!"

విసురుగా తువ్వాల తీసుకొని బాత్ రూంలోకి వెళ్ళి స్నానం చేయటం మొదలు పెట్టాడు- వంటిన నీళ్ళు పోసుకుంటే మనస్సన్నా చల్లబడుతుందేమోనన్నట్లుగా.

సరిగ్గా అప్పుడే మళ్ళా ఫోను మ్రోగింది. లాంగ్ కాల్.

రాజ్యలక్ష్మి పరుగెత్తుకుంటూ వెళ్ళి ఫోనెత్తింది.

"నేను సరోజను పిన్నీ... నాన్న పోయారు!" అన్నది ఒక్కసారిగా ఘొల్లుమంటూ.

"అయ్యయ్యో! అట్లాగా తల్లీ... హాస్పిటల్‌లోనే పోయారా నాన్న... హాస్పిటల్లో జేరుస్తున్నట్లుగా నిన్న చేసినా బాగుండేది గదమ్మా... బాబాయి బొంబాయినుంచి

ఎప్పుడొస్తారో ఏమో... అక్కడ ఎక్కడ దిగారో గూడా తెలియదు... ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావటంలేదు... నేనయితే ఇప్పుడు వెంటనే బయిల్దేరుతున్నాను... భయపడబోకండి ... మనవాళ్ళెవరైనా వచ్చారా సరోజా!" అన్నది తెచ్చిపెట్టుకున్న విచారాన్ని వ్యక్తపరుస్తూ.

"నాన్న స్నేహితులు వచ్చారు పిన్నీ... బాబాయికే కబురు ఎలా పంపాలో ఆలోచించు... నాకు అంతా అయోమయంగా వున్నది... వాళ్ళ ఆఫీసు వాళ్ళకు తెలుసేమో బాబాయి బొంబాయిలో ఎక్కడున్నదీ!"

"ప్రయత్నిస్తానమ్మా... ప్రయత్నిస్తాను... నాకూ కాళ్ళూ చేతులూ ఆడటంలేదు నువ్వామాట చెప్పినప్పటినుంచి!"

"ఉంటాను పిన్నీ!"

"అమ్మ జాగ్రత్త! అమ్మ దగ్గరుండునువ్వు...!" ఫోను పెట్టేసింది.

అప్పటికే మూర్తి బాత్‌రూం లోనుంచి బయిటకు వచ్చి ఆమె ఎదురుగ్గా నిలబడి వున్నాడు.

"మీ అన్నయ్య పోయాడట!"

సచ్చిదానందమూర్తి జావలా జారిపోయాడు. కట్టుకున్న తువ్వాలతో పక్కనే ఉన్న సోఫాలో కూర్చున్నాడు నీరసంగా. దుఃఖం ముంచుకు వస్తోంది. నిగ్రహించుకోలేక పోతున్నాడు.

"పెట్టెలో అందరివీ తలా రెండు జతలూ పడేయ్... బీరువాలో డబ్బెంతుందో చూడు!" అన్నాడు తలను చేతి వేళ్ళతో నొక్కుకుంటూ.

రాజ్యలక్ష్మి మాట్లాడలేదు. భర్తనే చూస్తున్నది.

సచ్చిదానందమూర్తికి కంటివెంట నీరు ధారాపాతంగా కారుతున్నది. చిన్నప్పుడే అమ్మా నాన్నా పోతే తనే అన్నీ అయి పెంచాడు. వదిన మటుకు వదిన– తనను కన్న కొడుకులా చూచుకున్నది. ఈనాడు ఆయన పోవటం తనకు పెద్దదిక్కు పోయినట్లే!... గుండెల్లోనుంచి వేదన పుట్టుకు వస్తున్నది.

"అంటే నన్ను ఇప్పుడు నలుగురి ముందూ అవమానపరచాలనా మీ ఉద్దేశ్యం!"

ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తాడు. ఆమె ఏం మాట్లాడుతున్నదో అర్థం కానట్లుగా ఆమెనే చూస్తున్నాడు.

"పొద్దుటికి పొద్దున మీరు బొంబాయి వెళ్ళారని చెప్పాను... ఇప్పుడు మీరు అక్కడ ఎక్కడున్నారో గూడా తెలియదని చెప్పాను... తగుదునమ్మా అంటూ మీరు అక్కడికి వెళితే నా గురించి వాళ్ళేమనుకోవాలని!... నేను అబద్ధాలకోరుననీ, అన్నయ్య చావుబ్రతుకుల్లో వున్నాడన్నా మీరు చూడటానికి వెళ్ళటం నాకిష్టం లేక అలా చెప్పానని అనుకోవాలనా? అన్నా తమ్ముళ్ళను ఆమడ దూరం ఎడం చేశానని వాళ్ళంతా నన్ను తిట్టిపోయాలనా?... అందుకేనా మీరు అక్కడకు వెళ్ళేది!"

సచ్చిదానందమూర్తి బిగుసుకు పోయాడు. ఏం మాట్లాడుతున్నది అది- తన అన్నయ్య... తనను ఎత్తుకు మోసి పెంచిన అన్నయ్య పోతే తనను అక్కడకు వెళ్ళ వద్దంటున్నదా!

"నేను స్వంత తమ్ముడినే... ఇప్పుడు ఆయనకు కొరివి పెట్టవలసింది నేనేనే!"

"చచ్చిన ఆయన చూస్తాడా ఎవరు పెట్టింది... ఎవరో ఒకరు పెట్టకుండా ఆ శవాన్ని మీ కోసం అట్టిపెట్టుకు కూర్చుంటారా?... అయినా అది నా పరువుకు మించిన విషయమా?" కంఠం హెచ్చించి అరవటం మొదలు పెట్టింది.

తెరుచుకున్న నోరు మూత పడలేదు సచ్చిదానందమూర్తికి.

"మీరు నేను చెప్పినమాట విని మాట్లాడకుండా ఇంట్లోనే వుండండి. నేనొక్కదాన్నే వెళతాను... ఆయన్ను తగలేసే కార్యక్రమం అవ్వగానే వచ్చేస్తాను... ఇప్పుడు వెళ్ళి అక్కడ మీరు వేలకువేలు తగలేయాల్సిన పనేంలేదు... తొమ్మిదో రోజో పదో రోజో వెళ్ళండి... ఆ తగలేసిన వాళ్ళే మిగతా కార్యక్రమాలు గూడా చేస్తారు... ఆశీర్వచనాలు కాగానే వచ్చేయండి... మనం పెట్టగలిగిన దానికంటే ఎక్కువే పెడుతున్నాం వాళ్ళకు... చచ్చుకొంపో పుచ్చుకొంపో పూర్తిగా వాళ్ళకే వదిలేశారు గదా... మీరు ఆ యింట్లో నుంచి బయిటకు వచ్చి ఇన్నాళ్ళయినా ఒక్క రూపాయి ఆదాయం వచ్చిందా మనకు దానిమీద... ఎట్లాలేదన్నా, ఎంత చిన్న పాతకొంపయినా గుంటూరులో ఆ యింటికి రెండు లక్షలకు తక్కువ రాదు... అమ్మి మీ వంతు లక్షా మీరు తెచ్చుకున్నట్లయితే నెలకు అంతో యింతో వడ్డీ వచ్చేదా... అదంతా ఇన్నాళ్ళూ బూడిదలో పోసినట్లేనా... చెప్పేవాళ్ళు, అడిగేవాళ్ళు లేక మీరు అలా చేస్తున్నారు... రేపు నా పిల్లల చదువులకీ, ఆడపిల్ల పెళ్ళికీ ఎంత కావాల్సి వస్తుందో అసలు మీకేమన్నా ఆలోచన వున్నదా?"

సచ్చిదానందమూర్తి నిగ్రహించుకోలేకపోయాడు కోపాన్ని.

"ఏం మాట్లాడుతున్నావు నువ్వు... చనిపోయింది నా స్వంత అన్నయ్యే... నేను వెళ్ళొద్దా... నువ్వు వెళతావా... అది నోరేనా?" గయ్‌న లేచాడు.

రాజ్యలక్ష్మి అతడి అరుపులకు వెక్కుపుట్టేలా ఏడ్వసాగింది.

"నన్ను నలుగురిలో అవమానం చేయండి... నన్ను మీ వాళ్ళందరి ముందూ రాక్షసిలా చిత్రీకరించండి... వెళ్ళండి... వెళ్ళండి... మీరు వచ్చి వాళ్ళ హేళనలను చెబుతుంటే విని ఏడ్చేదానికంటే ఇంత విషం తిని చావటం మంచిది... మీరు అక్కడకు వెళితే మాత్రం తిరిగి వచ్చి నా శవాన్నే చూస్తారు!" అన్నది నెత్తి కొట్టుకుంటూ వలవలా ఏడుస్తూ.

సచ్చిదానందమూర్తికి ఏం చేయాలో అర్థం కాలేదు.

అది అన్నదాంట్లోను అబద్ధం లేదు. వాళ్ళకు ఫోనులో తను క్యాంపు కెళ్ళినట్లుగా చెప్పి పెద్ద ఇరకాటంలో పెట్టేసింది. ఇప్పుడు తను నిజంగా వెళితే అది అన్నంత పని చేసినా చేస్తుంది– మహా మొండి మనిషి!

సోఫాలో నుంచి లేవలేనంతగా నీరసించి పోయాడు సచ్చిదానందమూర్తి. కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

తరువాత అరగంటకు రాజ్యలక్ష్మి చేతి సంచీతో బయిటకు వచ్చింది.

"నేను వెళుతున్నాను... పిల్లలు జాగ్రత్త... రేపొద్దుటి దాకా మీరు ఫోను ఎత్తవద్దు... మీరేం దిగులు పడబోకండి... అక్కడ తగలేత కార్యక్రమానికి మన వంతు ఓ వెయ్యి రూపాయిలు తీసుకు వెళుతున్నాను లేండి!"

రాజ్యలక్ష్మి చరచరా బయిటకు వెళ్ళిపోయింది.

⁘ ⁘ ⁘

మూడోరోజు ఉదయం తెల్లవారేటప్పటికి కాలింగ్ బెల్ మ్రోగితే వెళ్ళి తలుపు తీశాడు సచ్చిదానందమూర్తి.

ఎదురుగ్గా భార్య... చేతిలో సంచీతో...

మెదలకుండా వెనక్కు తిరిగి వచ్చి మంచం మీద పడుకున్నాడు.

తనేం అడగాలి... అడిగినా ఆమె చెప్పేదేమున్నది... అంతగా చెప్పాల్సిందేమైనా వుంటే ఆవిడే చెబుతుందిలే అన్నట్లుగా దుప్పటి బిగించేశాడు.

ఇవ్వాళ రాత్రికి వెళ్ళి ఒక్కసారి వదినను, సరోజను పలకరించి వస్తే- తన మనస్సు కుదుట పడుతుంది. తను చెప్పవచ్చు- బొంబాయినుంచి వచ్చేటప్పటికి రాజ్యలక్ష్మి ఈ వార్త చెప్పిందని, వెంటనే బయిల్దేరానని...

ఒక అబద్ధం వేయి అబద్ధాలకు బీజమవ్వవచ్చు... కానీయ్ చేసేదేమున్నది...

ఎనిమిది గంటలప్పుడు మంచం మీదనుంచి, ఆలోచనల తెరలను చింపివేసుకుంటూ లేచి, వంటయింట్లో కాఫీ పెడుతున్న భార్య వద్దకు వచ్చాడు.

"నేను రాత్రికి గుంటూరు వెళుతున్నాను!"

ఒక్కసారి తలెత్తి నిరసనగా భర్త ముఖంలోకి చూచి తలవంచుకున్నది ఆమె.

"మీ యిష్టం... అయినా ఇప్పుడెందుకు అంత హడావుడిగా వెళ్ళటం... తొమ్మిదో రోజు కర్మ మొదలు పెడతారట... అప్పుడు వెళ్ళండి!"

"అప్పుడు మళ్ళా వెళతానులే... ఏ ఇబ్బందీ లేకుండా అన్నీ బాగా జరిగినయ్యా!"

"ఇదేమైనా పెళ్ళా బాగా జరిగిందా అని అడగటానికి... శుభ్రంగా తగలేశారు!" అన్నది విసురుగా. "మీరు లేనంత మాత్రాన అక్కడ ఏమీ ఆగవులెండి... ఆయనకు కావాల్సినంతమంది మిత్రులున్నారు... అదిగాదు... నాకు ఆశ్చర్యమేస్తోంది... నేను వేయి రూపాయలు యిస్తే చటుక్కున తీసేసుకుంది ఆ పిల్ల వద్దువద్దంటూనే- మళ్ళా నేనెక్కడ వెనక్కు తీసుకుంటానో అన్నంత ఆదుర్దాగా- లేకి మనుష్యులు... లేకి వేషాలు!"

భార్యను కదిలించటమే తప్పు అన్నట్లుగా విసురుగా బెడ్‌రూంలోకి వచ్చేశాడు సచ్చిదానందమూర్తి.

అన్నట్లుగానే ఆ సాయింత్రం ఆఫీసునుంచి వచ్చింతరువాత గుంటూరుకు బయిల్దేరాడు.

"ఇదుగో చెబుతున్నాను... ఇవ్వాళే బొంబాయినుంచి వచ్చానని చెప్పండి!" అన్నది రుసరుసలాడుతూ. "నోరు జారారో నేను మీకు దక్కను!"

ఒక్కసారి అసహ్యంగా భార్య ముఖంలోకి చూచి ఆటో ఎక్కాడు సచ్చిదానందమూర్తి.

* * *

తెల్లవారుజామున అయిదు గంటలకు శంకర విలాస్ దగ్గర బస్సు దిగి అరండల్‌పేట వైపుకు నడవసాగాడు. చేతిలో వున్న చిన్న సంచీ గూడా చాలా బరువుగా వున్నట్లనిపిస్తోంది.

అన్నయ్య లేని ఆ గృహానికి తను మొట్టమొదటిసారిగా వెళుతున్నాడు.

అన్నయ్య అనుకుండేటప్పటికల్లా కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. చివరకు ఆయన చివరి చూపు గూడా దక్కని దురదృష్టవంతుడు తను.

ఆయనకు తనంటే ఎంత ఆప్యాయతో తనకు తెలుసు.

కాలేజీలో చదువుకుండే రోజుల్లో- ఒకసారి క్లాసు వాళ్ళంతా నాగార్జునసాగర్‌కు ఎక్స్‌కర్షన్ వెళుతున్నారు. బస్సులు ఏర్పాటు చేశారు. రానూ పోనూ చార్జీల క్రింద నూటయాభై రూపాయలు...

తనకు అందని విషయం. మిత్రులంతా గోల వెళ్దాం పదమని... అక్కడికి వెళ్ళాలంటే బస్సు చార్జీలే కాక కనీసం పైన ఇంకో యాభై అయినా కావాలి!

తనకు తెలుసు అన్నయ్య పరిస్థితి. అడగలేదు. అడిగితే అప్పోసొప్పో చేసి తెచ్చి ఆయన ఇవ్వవచ్చు. దొరక్కపోతే ఇవ్వలేకనూ పోవచ్చు- కానీ ఇవ్వలేకపోతే ఆయన పడే బాధ తనకు తెలుసు!

స్నేహితులు ఎంత పట్టుపడుతున్నా తను సుముఖత చూపలేదు.

డబ్బు కట్టేటందుకు ఇంకా ఒక్కరోజే ఉందనగా అన్నయ్యే అడిగాడు: "నువ్వు వెళ్ళటం లేదురా నాగార్జునసాగరు ...రాత్రి ప్రహ్లాదరావు గారింటికి వెళితే ఆయన అన్నాడు- వాళ్ళబ్బాయి నీ క్లాసే గదా... అంతా వెళుతున్నారట!"

"లేదన్నయ్యా! ఇప్పుడు అనవసరంగా రెండువందల ఖర్చు ఎందుకని... చూద్దాంలే... ఎప్పుడో మనమే అంతా కలసి వెళ్దాం!"

"స్నేహితులతో వెళ్ళటం వేరు... ఇంట్లో వాళ్ళతో వెళ్ళటం వేరు... అంతగా అయితే మరోసారి వెళ్దాం... రేపు డబ్బిస్తాను... నువ్వు గూడా వెళ్ళు!"

తను మాట్లాడలేకపోయాడు. తనకూ మనస్సులో వెళ్ళాలనే వున్నది... తను అక్కడికి వెళ్ళి వచ్చిన తరువాత పొందిన ఆనందం కంటే, ఉంగరం లేని అన్నయ్య చేతి వేళ్ళు చూచిన బాధ తనని ఎంతగా వ్యధ పరిచిందో ఇప్పటికీ గుర్తుకు వస్తే తనకు కన్నీళ్ళు ఆగవు. తను ఉద్యోగంలో జేరిన తరువాత జీతం అందుకొని తను మొట్టమొదటిగా చేసిన పని ఆ ఉంగరాన్ని మార్వాడీ దగ్గర తాకట్టు నుండి విడిపించుకు రావటం...

పిచ్చికలగుంట దాటింతరువాత ఓ చిన్న పెంకుటింటి ముందు ఆగాడు.

ఆ యింటిని చూస్తుంటే అన్నయ్య పోయినట్లుగానే- ఆ యింట్లో వాళ్ళకు సరైన ఆచ్ఛాదన ఇవ్వలేనట్లుగా కప్పుమీద అక్కడక్కడా లేచిన పెంకులు... ఎప్పుడో తండ్రి కట్టించిన గోడల మీద నేటి ఆ యింటి పరిస్థితిని తెలియబరుస్తున్నట్లుగా, ఊడిన సున్నంపెచ్చులూ... ఇంట్లో ఎలావున్నా బయిటకు తెలియగూడదన్నట్లుగా కట్టిన వాకిటి ముందు తడికల దడి... తన భార్య మనస్సులా గడప ఇవతల పారుతున్న మురుగు కాలువ... దాని మీద వున్న నాపరాతి మీద కాలు పెట్టి తడికిల దడికున్న ఇనుప కొక్కాన్ని తీసి, రెండు మెట్లెక్కి, తలుపు మీద గొళ్ళెంతో కొట్టాడు సచ్చిదానందమూర్తి.

"సరోజా!"

లోపల అలికిడి. కిర్రుమంటున్న తలుపు శబ్దం. తడుస్తున్న కళ్ళకు అంతా చీకటి...

తలుపు తెరుచుకున్నది.

ఆ గుడ్డి వెలుగులో అతడిని చూస్తున్న సరోజలో క్షణంపాటు గుండె బిగుసుకు పోయినట్లుగా నిశ్శబ్దం...

"బాబాయ్!" కోలుకున్న మరుక్షణంలోనే ఆపుకోలేనంతగా ఏడుపు. "బాబాయ్... బాబాయ్... నాన్న పోయాడు బాబాయ్!" విలవిలలాడుతూ తూలింది.

చటుక్కున సచ్చిదానందమూర్తి ఆమెను పట్టుకున్నాడు.

"ఏడవకురా!" అంటున్నా అతడు తన దుఃఖాన్ని ఆపుకోలేకపోతున్నాడు. "మనకెవరికీ లేడమ్మా ఆయన... కనీసం నాకు చివరి చూపు గూడా దక్కలేదు!" గొంతు పూడుకు పోయింది.

మధ్య తలుపు చప్పుడయింది. అక్కడ నేల మీద కూలబడి వున్న వదిన కనబడింది.

వెళ్ళి ఆమె ఎదురుగ్గా సచ్చిదానందమూర్తి కూర్చున్నాడు రోదిస్తూ.

"వదినా!"

ఆమె చీర చెంగును ముఖాన కప్పుకున్నది.

"నాయినా! అయిపోయింది... నా దేఁవుడు వెళ్ళిపోయాడు... నేను బ్రతికి ఏం చేయాలి?" ఆమె కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నది.

"వదినా!" అతడికి నోటి నుండి మరో మాట పెగలటం లేదు. బెక్కు వస్తున్నది. వాళ్ళను ఎలా ఓదార్చాలో అర్థం కానట్లుగా అచేతనంగా కూర్చుండిపోయాడు.

ఆ యింటి మీద కాకులు వాలుతున్నట్లుగా పక్కనున్న రావిచెట్టు ఆకులు గలగలలాడుతున్నయి ఉండిఉండి వీస్తున్న గాలికి!

❖ ❖ ❖

రెండు గంటలయింది.

సరోజ బలవంతం చేయగా నాలుగు మెతుకులు గతికాడు. వాళ్ళ దూరపు బంధువు ఒకామె పొద్దున్నే వచ్చి ఇంత ఉడకేసింది.

బంధువులు, తెలిసినవాళ్ళు వస్తున్నారు, వెళుతున్నారు. అందులో చాలామంది సచ్చిదానందమూర్తికి పరిచయస్థులే.

ఆయన పోయినప్పుడు ఆసుపత్రిలో వున్నవాళ్ళు, "చివరివరకు మీ అన్నయ్య నిన్ను కలవరిస్తూనే వున్నాడయ్యా... దురదృష్టం- నువ్వు బొంబాయి వెళ్ళావట గదా... ఒక్కొక్కసారి ఇలాగే జరుగుతుంటుంది... ఆయనకు ప్రాణం పోతున్నప్పుడు గూడా ఆ కళ్ళు తలుపు వంకే చూస్తున్నయి!" అంటుంటే సచ్చిదానందమూర్తి గుండె పగిలిపోయింది.

ఎవరో కాఫీ కలిపి తెచ్చారు.

"నేను రాత్రికి వెళతాను వదినా!... ఇంటికి వచ్చేటప్పటికి అది ఈ భయంకరమైన వార్తను చెప్పింది... ఆగలేక వెంటనే బయిల్దేరి వచ్చాను!" ఆమాటలు చెబుతుంటే తనని ఎవరో రంపంపెట్టి కోస్తున్నట్లే అనిపించింది. "తొమ్మిదిన కదా కర్మ మొదలు పెడుతున్నది... నేను ఎనిమిదినే వస్తాను... నేను వచ్చి మిగతా ఏర్పాట్లు చేస్తానులే... భయపడబోకు వదినా! నువ్వే డీలా పడిపోతే- సరోజ చిన్నపిల్ల... దానికి ధైర్యం చెప్పేదెవరు?"

"ఇప్పుడు వెళ్ళక పోతేనేం... ఈ నాలుగు రోజులయినా ఉండగూడదా నాయినా... దానికి ఏంచేయాలో తెలియక గిలగిలలాడిపోతున్నది... అన్నయ్య స్నేహితులు ఎంతమంది వచ్చి ఎన్ని చూచినా ఇంటివాడివి నువ్వుంటే అదొక ధైర్యం!" అన్నది ఆమె తలవంచుకొని.

"లేదు వదినా! ఆఫీసులో నాకు చాలా ముఖ్యమయిన పనులున్నయి!" మాట తడబడింది అలా చెబుతుంటే. "వస్తాను గదా... ఎనిమిదో రోజే వస్తాను... ఏమాత్రం వీలున్నా ఇంకా ముందు వస్తాను!" అన్నాడు, అది అంత తేలికగాదు అని మనస్సులో వున్నా.

"వచ్చేటప్పుడు రాజ్యలక్ష్మిని పిల్లల్ని గూడా తీసుకురా... మొన్నటికి మొన్న నువ్వు లేకపోయినా హడావుడి పడుతూ కబురు వింటూనే ఆగలేక వచ్చింది పిల్లల్ని ఒంటరిగా వదిలి! దాన్ని చూస్తే నాకు జాలి వేసింది!"

"వద్దన్నా వినకుండా వెయ్యి రూపాయలు ఇచ్చి వెళ్ళింది పిన్ని! అవి ఖర్చు కాలేదు... అట్లాగే వున్నయి... నీ కిస్తాను తీసుకువెళ్ళు బాబాయ్!"

ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తాడు సచ్చిదానందమూర్తి- తనింట్లో తన పరిస్థితి ఏమిటో వాళ్ళకు తెలిసిపోయిందన్నట్లుగా గిలగిలలాడిపోయాడు.

"అది చాలా బాధపడ్డది నేను లేకపోవటంతో... పక్కన ఎవరినో అడిగి దొరికినంత వరకూ తీసుకు వెళ్ళానన్నది!" మనస్సు పతనమయినప్పుడు ఎన్నో ఊహలు పుట్టుకు వస్తుంటయి కుక్క గొడుగుల్లా చేసిన తప్పులు కప్పి పుచ్చుకునేటందుకు. "వద్దమ్మా! ఆ డబ్బు ఉండనీయ్... నేను తిరిగి నువ్వు ఇచ్చావుగదా అని తీసుకు వెళితే అది ఎంతగానో బాధపడుతుంది!" అన్నాడు సగం మాటలను గొంతులోనే నొక్కుకుంటూ.

"సరోజా! నాన్న పెట్టెలో ఓ గుడ్డ సంచీ వుంటుంది పట్టుకురా అమ్మా!" అన్నది ఆమె గోడ వారకు జరిగి ఆనుకు కూర్చుంటూ.

"ఆసుపత్రి ఖర్చులు, మొన్నటికి మొన్న ఖర్చులు... చాలా అయివుంటయి గదా! ఎలా ఏర్పాటు చేశారు వదినా! చాలా ఇబ్బంది పడి వుంటారు... ఆయన్ను ఆసుపత్రిలో జేర్చగానే నాకు ఫోను చేయవలసింది!"

"టైం ఎక్కడుంది బాబాయ్! పొద్దున జేర్చాం... జేర్చిన పావుగంటలోనే నీకు ఫోను చేశా... క్రితం రోజు రాత్రే నువ్వు బొంబాయి వెళ్ళావట... ఆ మాట వినటంతోటే నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు... అప్పటికీ పరబ్రహ్మంగారు, ప్రహ్లాదరావుగారు- నాన్న స్నేహితులు నీకు తెలుసు గదా- హడావుడిగా పరుగెత్తుకుంటూ వచ్చారు... వాళ్ళే చూచుకున్నారు అంతా... ఎంతయిందో కనుక్కొని రెండు మూడు రోజుల్లో సర్దాలి!" అన్నది సరోజ తండ్రి పెట్టెలో వున్న గుడ్డ సంచీ కోసం పెట్టె మూత తీస్తూ.

ఎన్ని వేలు అయివుంటుందో అన్నట్లుగా కాస్త ఇబ్బందిగా కళ్ళు మూసుకున్నాడు సచ్చిదానందమూర్తి. ఎంతైనా ఫరవాలేదు. తను ఏదో విధంగా సర్దగలడు. అది పెద్ద సమస్య కాదు. కాని ఆ విషయంలో రాజ్యలక్ష్మి వేయబోయే వీరంగాన్ని తలుచుకుంటేనే మనస్సు అల్లకల్లోలమవుతున్నది.

అన్నయ్య విషయంలో ఎంత ఖర్చు పెట్టినా తనకు ఆనందమే మిగులుతుంది. ఈనాడు తను ఇలా వున్నాడూ అంటే అది ఆయన ఆశీర్వాదమే... కాదూ, నాన్న పోయిన తరువాత ఆయనలోగాని, వదినలోగాని, ఈనాడు రాజ్యలక్ష్మిలో పేరుకు పోయిన ఆలోచనలలాంటివే ఉండి వున్నట్లయితే- తనూ, తన చదువూ పదో తరగతితోటే

ఆగిపోయివుండేది... ఇప్పుడు తను ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఇబ్బందులతో పడుతూ లేస్తూ వుండేవాడు.

ఆయన అగచాట్ల మెట్లమీద నడుస్తూనే తనను పైపైకి తీసుకు వెళ్ళాడు. అది తన అదృష్టం. రాజ్యలక్ష్మి అర్థం చేసుకోదు ఆ విషయం ఎంత చెప్పినా... దానికి ఎంతసేపూ తనూ, తన కొడుకూ, కూతురూ... తన సంసారం సుఖంగా వుండాలనేదే కోరిక!

సరోజ పెట్టెలో వున్న గుడ్డ సంచీని తెచ్చి తల్లికిచ్చింది.

గోడకు ఆనుకొని కూర్చొని వున్న ఆమె ముందుకు వంగి సంచీలోని కాగితాలను బయిటకు తీసింది.

"మొన్న అన్నయ్య రిటయిరయింతరువాత ఓ డెభై వేలదాకా వచ్చినయి!" అంటూనే ఘొల్లున ఏడ్వటం మొదలు పెట్టింది. బెక్కుతూనే, "చూడు సీతా! ఇంతవరకూ మన పెళ్ళయి ఇన్నేళ్ళయినా నీకంటూ నేనేమీ కొనలేదే... మనకు ఎప్పుడూ డబ్బు ఇబ్బందే... ఇదుగో ఇప్పుడొచ్చింది ఇంత డబ్బు చేతిలోకి... గులాబీ రంగు పట్టు చీర ఎర్రటి నీకు ఎంతో బాగుంటుందే అంటూ- నేనెంత వద్దన్నా వినకుండా రెండు వేలు పోసి కొనుక్కొచ్చారయ్యా!" అంటూనే నెత్తిమీద టపటపా కొట్టుకోసాగింది.

సరోజ పక్కన కూర్చొని తల్లిని పట్టుకున్నది. "ఊరుకో అమ్మా! ఊరుకో..." అంటూ అనునయించసాగింది.

పావుగంట పట్టింది ఆమెకు ఆ ఆవేశపు దుఃఖాన్ని నిగ్రహించుకునేటందుకు.

"అందులోనుంచి ఇద్దరు ఆడపిల్లలకు చెరో పాతికవేలు వాళ్ళ పెళ్ళిళ్ళకు గాను ఫిక్సెడ్ డిపాజిట్లో వేశారు... మిగతాది చిల్లరమల్లర అప్పులకు, ఇంటి ఖర్చులకు సరిపోయింది!"

సచ్చిదానందమూర్తి విచిత్రంగా వదిన ముఖంలోకి చూచాడు. "ఇద్దరు పిల్లలు ఎవరు వదినా?"

"సరోజ... సుస్మిత!"

ఉలిక్కి పడ్డట్లుగా కళ్ళు పెద్దవి చేసుకొని కొద్దిగా మెడవంచి ఆమె ముఖంలోకే కన్నార్పకుండా చూస్తూ వుండి పోయాడు- సుస్మిత తన కూతురు!

"దాంతో వాళ్ళ పెళ్ళిళ్ళు అయిపోతయ్యని కాదు... ఆ సమయంలో ఏదో ఒక ఖర్చుకు కలిసి వస్తుందని!" అన్నది ఆమె తలవంచుకొని.

"అదేంటి వదినా! సరోజ కోసం వేశాడంటే అర్థమున్నది... సుస్మితకు దేనికి?" అన్నాడు ఆయన ఆలోచన విచిత్రంగా అనిపించగా.

"అది మాత్రం మన యింటి ఆడపిల్ల కాదా... దాని పెళ్ళికి మాత్రం ఖర్చు వుండదా?"

నాభినుండి దుఃఖం ఎగతన్నింది సచ్చిదానందమూర్తికి వదిన మాటలకు.

"నన్ను నా కాళ్ళ మీద నిలబెట్టారు... ఇంతటి వాడిని చేశారు... ఇంకెన్నాళ్ళు పెడతారు వదినా! అన్నయ్య ఇట్లాంటి పిచ్చి పనులే చేస్తుంటాడు... నువ్వయినా చెప్పొద్దా!" అన్నాడు వలవలా ఏడుస్తూ.

"ఆయన చేసింది ఏముందయ్యా! న్యాయంగా ఆలోచిస్తే ఇంకెంతో దక్కాలి నీకు... నువ్వు ఈ ఇంటినుండి వెళ్ళింతరువాత ఈ ఇల్లంతా మేమే వాడుకుంటున్నామా... గుంటూరులో దీనికి నెలకు కనీసం మూడు నాలుగు వందలయినా అద్దె వస్తుంది... ఆయన నీకు పైసా ఇవ్వకుండా ఈ ఇంటిని తనే అనుభవిస్తున్నందుకు ఎంతగా బాధ పడేవారో తెలుసా!"

"అంటే ఈ విధంగా నా బాకీ తీర్చుకుంటున్నారన్నమాట!" కోపంతో అరుస్తున్నట్లుగా అన్నాడు. "నేను భరించ లేను వదినా ఈ వేదనను... ఈ మాటతో నన్ను ఈనాడు ఎంత పరాయివాడిగా మీరు చూస్తున్నారో తెలిసి పోతున్నది... నేను మీకేమీ కానా? మీరు అలాగే అనుకుంటే నాన్న పోయినప్పటి నుంచీ మీరు నాకు ఎంతపెట్టారో లెక్క కట్టండి... అణా పైసలతో నేను ఇచ్చివేసి పరాయివాడిలా ఈ ఇంటినుంచి వెళ్ళిపోతాను... నేను భరించలేను వదినా ఈ భావనను... ఇంతకంటే నాకు చిత్రహింస మరొకటి వుండదు!" సచ్చిదానందమూర్తి నేలమీద పడి రోదించ సాగాడు. "ఇది నేను భరించలేను... నేను భరించలేను!"

వదిన అతడి దగ్గరికి జరిగి అతడి చేయి పట్టుకొని, "నాన్నా! నీ మనసు నాకు తెలియదా... నువ్వు బాధపడితే అన్నయ్య చూడగలడా... ఆయన ఆత్మతృప్తికి ఈ చిన్న పని చేశాడయ్యా! నువ్వు కాదనవద్దు!" అన్నది.

రెండు నిముషాల తరువాత సచ్చిదానందమూర్తి లేచాడు. అతడి ముఖం బాగా ఏడ్వటంతో ఎర్రబడి చెమటతో తడిసి వున్నది.

"కాదు వదినా! నేను ఈ కుటుంబ సభ్యుడినే అనుకుంటే- నేను చెప్పిన మాట విను... సుస్మితకు అన్నయ్య డబ్బును నేను తీసుకోను... అంతేకాదు మంచి సంబంధం చూచి సరోజకు వివాహం చేసే బాధ్యత గూడా నాదే... ఈ ఇంటిని నీది, నాదిగా

చూడవద్దు... మనది... నాన్న ఇచ్చిన ఇది మనందరిదీ వదినా! అమ్మా సరోజా! నాన్న స్నేహితులకు ఎంతివ్వాలో చెబితే అదీ, రేపు కర్మ మొదలు పెట్టింతరువాత కావాల్సిన ఖర్చులకు నేను వచ్చేటప్పుడు తీసుకు వస్తాను... తమ్ముడిగా అన్నయ్య చితికి అగ్ని సంస్కారం చేయలేక పోయినందుకే సగం చచ్చివున్నాను... రేపు మిగతా కార్యక్రమాలనన్నా తృప్తిగా నన్ను చేయనివ్వండి!" అన్నాడు సచ్చితానందమూర్తి దృఢంగా.

ఆ క్షణాన అతడు భార్య రాజ్యలక్ష్మి అనే మనిషి ఉనికినే సంపూర్ణంగా మరిచిపోయాడు!

*(స్వాతి: మాసపత్రిక: ఏప్రియల్, 2006)*